క్లుప్తంగా

పాలిథిన్ నిషేధంపై ప్రచారం



మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: పాలిథిన్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అందరికీ యువత అవగాహన కల్పించాలని, కలిసికట్టుగా ప్లాస్టిక్ మహమ్మారిని నిషేధిద్దామని కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. పాలిథిన్ కవర్ల నిషేధంపై జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ బీచ్‌లో సోమవారం అవగాహన కల్పించారు. గుడ్డ సంచులను వినియోగించాలని, వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు పూర్తి స్థాయిలో నిషేధించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



కోచ్ రమణయాదవ్‌తో విద్యార్థులు

భీమునిపట్నం: విశాఖలో నిజి షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి అంతర్జాతీయ కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ సీఎం కప్ పోటీల్లో భీమిలికి చెందిన షాడో షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు గెలుచుకున్నారు. 11 నుంచి 13 సంవత్సరాల కేటగిరీలో కె.మోహనశ్రీ కాటా, కుమితి విభాగాల్లో కాంస్య పతాకాలు సాధించగా వి.శశాంక్ కాటా విభాగంలో బంగారం, కుమితిలో వెండి పతకం సాధించాడు. సీహెచ్.శివరాం కుమితిలో కాంస్యం, పి.సంజయ్ కాటాలో వెండి పతకం సాధించాడు. ఈ మేరకు సోమవారం చీఫ్ కోచ్ ముగడ రమణ యాదవ్ విద్యార్థులను అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

మధురవాడ: ఆక్రమణలతో మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు రోజురోజుకూ ఇరుకుగా మారిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మిథిలా వుడా లే అవుట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులరాజు, ఎమ్వీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా జోన్‌లోని 9 వార్డుల పరిధిలోని ప్రాంతాల నుంచి 7 అర్జీలు వచ్చాయి. వీటిపై చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

దుర్గానగర్‌లో అనధికార నిర్మాణం ధ్వంసం



దుర్గానగర్‌లో పాక్షికంగా ధ్వంసం చేసిన షెడ్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు దుర్గానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్‌ను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ప్రాంతంలో కృష్ణంరాజు అనే వ్యక్తి షెడ్డు నిర్మిస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు పనులు నిలిపివేయాలని చెప్పారు. అయినప్పటికీ పనులు చేస్తుండడంతో చర్యలు చేపట్టారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో షెడ్ గోడలు కూలగొట్టి ధ్వంసం చేశారు. సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ, పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల యూటర్న్..!



గొల్లవీధిలో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది (ఫైల్)



సంతపేటలో గతంలో అక్రమ నిర్మాణమని కూల్చిన ప్రదేశం... ప్రస్తుతం అక్కడ దుకాణాలు వెలిశాయి



గతంలో జీరుపేటలో కూల్చిన చోటే ప్రస్తుతం వెలిసిన దుకాణాలు

- అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ప్రారంభంలో హడావిడి
- తర్వాత అటువైపు కన్నెత్తి చూడని జీవీఎంసీ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమిత నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది యూ టర్న్ తీసుకోవడంపై పట్టణ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమిత నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే కంటితుడుపు చర్యగా తొలగింపులు చేపట్టి రెండు రోజుల తర్వాత వారే దొడ్డిదారిన అనుమతులు ఇస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, రహదారుల విస్తరణకు అవకాశం ఉండే చోట నిర్మాణాలు చేపట్టారని హడావుడి చేసి పాక్షికంగా పడగొడుతున్నారు. అనంతరం సిబ్బంది కొరత ఉందని, తర్వాత జేసీబీలతో వచ్చి కూలుస్తామని హెచ్చరించి వెంటనే మాట మారుస్తున్నారు. ఇలా తగరపువలస, చిట్టివలస, సంగివలస, భీమిలి డివిజన్‌లో వందలాది నిర్మాణాలు తొలుత తొలగించి... మళ్లీ అటువైపు అధికారులు చూడకపోవడంతో యథావిధిగా నిర్మించేస్తున్నారు. తగరపువలస ప్రధాన రహదారి, సంతబయలు రహదారుల్లో ఇలాంటి సంఘటనలు చాలా వరకు చోటుచేసుకున్నాయి. ఈ నెల 9న కూడా సంతపేట గొల్లవీధిలో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నట్టు మీడియాకు లీకులు ఇచ్చి భూమిపూజ చేసినట్టు పాక్షికంగా హడావుడి చేసి తర్వాత మరచిపోయారు. దీంతో అక్రమంగా నిర్మాణాలు చేపట్టేవారు భయపడటం లేదు. జరిమానాలు వసూలు చేయడంలో శ్రద్ధ చూపే టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కూల్చే విషయంలోనూ చిత్తశుద్ధితో వ్యవహరించాలని భీమిలి ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో బాలామణి

కొమ్మాది: పాఠశాలను, పరిసరాలను విద్యార్థులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో బాలామణి అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో గల మండల ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అప్పుడే ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయుల రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త మాధవి

తగరపువలస: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు ముందుగా ఒత్తిడిని జయించాలని పరీక్షా పర్వ్ 4.0 సమన్వయకర్త జె.మాధవి సూచించారు. ఏపీఎస్‌ఈఆర్, ఎస్‌సీఈఆర్‌టీ – ఏపీ సంయుక్తంగా నిర్వహించిన సెలబ్రేషన్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఓరియంటేషన్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఫర్ స్కూల్ చిల్డ్రన్స్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకుడు షేక్ అల్లావుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకునే మార్గాలను సూచించారు. విషయాన్ని అవగాహన చేసుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. వ్యక్తిత్వ వికాసానికి పోషకాహారం, వ్యాయామం, ఆత్మవిశ్వాసం దోహద పడతాయని సూచించారు.

సదుపాయాలు కల్పించాలని ఆందోళన



భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వాంబే కాలనీవాసులు

భీమునిపట్నం: స్థానిక నేరెళ్లవలస కాలనీ సమీపంలోని వాంబే కాలనీ వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానికులు సీఐటీయూ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ తాగునీటి సదుపాయం లేదని, పారిశుధ్య సిబ్బంది పనులు చేయడం లేదని, వీధిలైట్లు కూడా లేకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విద్యాగణపతి



నారాయణసేవ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేట శ్రీవిద్యాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి సహిత అయ్యప్పస్వామి ఆలయ పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుపరావు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర పూర్ణ కలశాలు, ఉత్సవమూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేర్వేరుగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బోయి శంకర్‌రెడ్డి, చిల్ల సూర్యనారాయణ, బోయి అప్పలరెడ్డి, అక్కరమాని మంగరాజు, మొక్క సూర్యనారాయణ, చిల్ల సూరిదాసు, ఎరుసు అప్పారావు, బోయి వెంకటరావు, కంబపు దుర్గారెడ్డి, చిల్ల అప్పలరెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, డెక్కతి శివ, చిల్ల కనకదాసు, నగిరెడ్ల రాంబాబు, చిల్ల గోపాల్, సరగడ శ్రీను, మొక్క శ్రీను, చిల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి

కొమ్మాది: ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గీతం వర్సిటీలో ప్రత్యేక వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ రానున్న 25 సంవత్సరాలను భారత దేశ అమృత గడియలుగా పరిగణిస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని తెలిపారు. కోవిడ్ – 19 వంటి మహమ్మారి తోపాటు రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ప్రపంచాన్ని కుదిపేస్తున్నా భారత ఆర్థిక రంగం సుస్థిరంగా ముందుకు సాగడానికి ప్రభుత్వ సంస్కరణలు కారణమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళా సాధికారిత, యువతలో నైపుణ్యాల పెంపు, విద్యారంగం ప్రగతికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో ప్రొ వీసీ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెట్స్‌కు సాయం

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి వెటరన్ అథ్లెట్స్‌కు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కందుకూరి నాగేశ్వరరావు, కందుకూరి లావణ్య దంపతులు హర్యాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వారు ఆ పోటీల్లో త్వరలో పాల్గొననున్నారు. వారిని ప్రోత్సహించడానికి రూ.5 వేలు లావణ్యకు శ్రీరామచంద్రమూర్తి అందించారు.

సీసీరోడ్డు మధ్యలో బోరు ఏర్పాటు

తగరపువలస: పద్మనాభం మండలం బి.తాళ్లవలస పంచాయతీలో సీసీ రోడ్డు మధ్యలో ఆదివారం రాత్రి సన్యాసప్పడు అనే వ్యక్తి బోరుబావి ఏర్పాటు చేశాడు. దీనిపై స్థానికులు సోమవారం సచివాలయంలో ఫిర్యాదు చేశారు. పరిశీలించిన సచివాలయ కార్యదర్శి గురునాయుడు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వేసిన బోరు బావి ఇతరులకు ఇబ్బందికరంగా ఉన్నందున నోటీసు జారీ చేసి తొలగిస్తామని తెలిపారు.

మండలానికి చేరిన పరికరాలు



మండల పరిషత్ కార్యాలయంలో పరికరాలు

పద్మనాభం: మండలంలో వివిధ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు సరఫరా చేసేందుకు పరికరాలు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిలో బుడ్డివలస అగ్రహారం, పెంట, నేరెళ్లవలస, బాందేవుపురం, చిన్నాపురం, శేరిఖండం, వెంకటాపురం, విలాస్‌ఖాన్ పాలెం పంచాయతీలకు ఎనిమిది ఫాగింగ్ యంత్రాలు, పెంట, రెడ్డిపల్లి, చిన్నాపురం, శేరిఖండం, పద్మనాభం, విలాస్‌ఖాన్‌పాలెం పంచాయితీలకు ఆరు హై ప్లెజర్ క్లీనింగ్ యంత్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా నాలుగు ఇన్సులేటెడ్ యంత్రాలు ఉన్నట్టు పంచాయతీ విస్తరణ అధికారి ఉషారాణి తెలిపారు.

స్థలం ఇప్పించాలని వేడుకోలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీకి చెందిన ములపర్తి సూరిబాబు, చిన్నయ్య సోదరులు తమకు జరిగిన అన్యాయంపై సోమవారం స్పందనలో ఇన్‌చార్జి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న 20 సెంట్లు డీఫారం భూమిని ఏడాదిన్నర క్రితం పంచాయతీ లాగేసుకుందన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు తమ సమస్య వివరించగా ఇద్దరికీ ఐదేసి సెంట్లు స్థలం ఇవ్వమని రెవెన్యూ అధికారులను ఆదేశించారన్నారు. ఆయన ఆదేశం ప్రకారం స్థలం ఇప్పించాలని కోరారు.

26 నుంచి తిరుకల్యాణ మహోత్సవాలు

పద్మనాభం: ఈ నెల 26 నుంచి మార్చి 8 వరకు అనంత పద్మనాభస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 26న పెళ్లిరాటతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా మార్చి 3న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. 5న తెప్పోత్సవం, 6న రథోత్సవం, 8న పుష్పాంజలి నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నారు.

భారత కోకిల సరోజినీ నాయుడు

తగరపువలస: భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఆమె జీవిత చరిత్రను బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమవారం వివరించారు. ఆమె 1925లో కాన్పూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు తొలి మహిళా అధ్యక్షురాలిగా, స్వతంత్ర భారత దేశపు తొలి మహిళా గవర్నర్‌గా పనిచేసినట్టు తెలియజేశారు. మానవసేవకు, దేశసేవకు అంకితమైన ఆమె 12వ ఏట మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి మెట్రిక్యులేషన్ పూర్తి చేసి 13 ఏళ్ల వయసులోనే 1300 పంక్తుల కవితను ఆరు రోజుల్లో పూర్తి చేశారన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మునితో కలిసి పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నారాయణరాజుపేటలో గ్రామసభ నేడు

భీమునిపట్నం: భీమిలి మండలం నారాయణరాజుపేట గ్రామంలో ఇనాం భూముల సెటిల్‌మెంట్‌కు సంబంధించి గ్రామస్తులు, రైతులతో మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.వేణుగోపాల్ తెలిపారు. పాస్ పుస్తకాల మంజూరు కోసం, ఇతర అంశాలపై ఆర్‌డీవో ఎస్.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించి 15 రోజుల క్రితమే నోటీసులు అందించామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే సమావేశంలో ఇనాం భూములకు సంబంధించే కాకుండా ఇతర అభ్యంతరాలు, విన్నపాలు తెలియపరచవచ్చని వెల్లడించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఆహ్వానం

పద్మనాభం: శివరాత్రి సందర్భంగా వైఎస్సార్‌సీపీ పద్మనాభం మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న గోస్తనీ విద్యాపీఠ్ ఆవరణలో నియోజకవర్గ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు అందించనున్నారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ మెమెంటోలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 97030 45204, 99857 30002లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు పునర్నిర్మాణంతో తీరిన కష్టాలు



కుసులువాడ వద్ద రోడ్డు పునర్నిర్మిస్తున్న దృశ్యం

ఆనందపురం : మండలంలోని పలు రోడ్లు దెబ్బతినగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకొని చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని పలు రోడ్లు పునర్నిర్మించడంతోపాటు, మరమ్మతులు చేపట్టారు. గొట్టిపల్లి నుంచి కుసులువాడ మీదుగా చిన్నయ్యపాలెం వరకు గల తారు రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చాలా ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో రోడ్డు పునర్నిర్మాణానికి రూ.85 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ రోడ్డు పునర్నిర్మించడంతో అద్దంలా తయారైంది. దీంతో రాకపోకలకు ఎంతో అనువుగా ఉంది. అలాగే మండలంలోని ముకుందపురం జంక్షన్ నుంచి రేగానిగూడెం మీదుగా గిడిజాల వరకు గల రోడ్డులో అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయి. వాటి మరమ్మతులకు రూ.7 లక్షల నిధులు మంజూరు కాగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని రోడ్లకు అంచెలంచెలగా మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు.

ఉత్సవాలకు సహకరించాలని వినతి



జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ అమ్మవారి ఉత్సవాలు మార్చి నెలలో నిర్వహించనున్నామని, అందుకు సహకారం అందివ్వాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు ఆధ్వర్యంలో ఇతర సభ్యులు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ ఉత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు వస్తారని, వారందరికీ మంచినీరు సరఫరా చేయాలని కోరారు. అలాగే పారిశుధ్యం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం జెడ్సీ రాము మాట్లాడుతూ ఉత్సవాలు సజావుగా నిర్వహించడానికి సహకరిస్తామని తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్ నాయుడు, కోశాధికారి కాసరపు పెద ఎల్లాజీ, కో ఆర్డినేటర్ నమ్మి శేషాద్రి యాదవ్, గంటా నూకరాజు, కె.ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పవన్‌కు సత్కారం



పవన్ సతీష్‌ను అభినందిస్తున్న అనిల్ నీరుకొండ ఆస్పత్రి ప్రతినిధులు

తగరపువలస: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్‌లో వాకో అండ్ కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన ఛాంపియన్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ – 2023 కిక్ బాక్సింగ్ పోటీల్లో మారోజు వెంకట పవన్ సతీష్ మొదటి స్థానంలో నిలిచాడు. సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పవన్ సతీష్ 46 – 49 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించాడు. ఈ సందర్భంగా బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్ అందుకున్నారు. 2022లో పవన్ సతీష్ ఛాంపియన్ ఆఫ్ ది గోవా టైటిల్ గెలుచుకున్నారు. అలాగే మూడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ మేరకు ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ దామిరెడ్డి జయభరత్‌రెడ్డి, సీఈవో నిరంజన్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా మాధవ్ త్రిపాఠి, మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, కొన్ని బాలరాజు, వైద్యులు, రేడియాలజీ విభాగ సిబ్బంది పవన్ సతీష్‌ను ఘనంగా సన్మానించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



బాధితులకు రగ్గులు, కిట్లు అందిస్తున్న అధికారులు, ట్రస్ట్ ప్రతినిధులు

- ముగిసిన స్పర్శ, కుష్టువ్యాధి ప్రచార కార్యక్రమాలు

తగరపువలస: మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుంచి ఈ నెల 13 వరకు నిర్వహించిన స్పర్శ, కుష్టువ్యాధి ప్రచార కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. కలెక్టర్ మల్లికార్జున సూచనల మేరకు ఈ ముగింపు కార్యక్రమం పద్మనాభం మండలం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపించకూడదన్నారు. స్పర్శలేని రాగి రంగు మచ్చలు కుష్టువ్యాధి కావచ్చన్నారు. ముఖంపై కణితులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, స్పర్శ లేకపోవడాన్ని కుష్టువ్యాధిగా నిర్ధారించారు. స్థానిక వైద్యాధికారిణి స్వప్న మాట్లాడుతూ ప్రారంభ దశలో ఈ వ్యాధిని గుర్తించడానికి సిబ్బంది నిరంతరం ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజాచైతన్యం, అవగాహన ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా విశాఖలోని మానవతా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ హెల్త్ కేర్ ఎండీ అప్పసాని నాగు 50 మంది కుష్టువ్యాధి బాధితులకు రగ్గులు, అల్సర్ కిట్లు, ఎంసీఆర్ చెప్పులు అందించారు. రవాణా, భోజన సదుపాయాలతోపాటు పుండ్లు ఉన్నవారికి డ్రెస్సింగ్ చేశారు. వ్యాధిపై అవగాహనకు రేవిడి హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వైద్యురాలు సౌజన్య, సీఎంవో శాంతకుమారి, డీపీఎంవో భీమేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవోలు శ్రీనివాసరావు, రాము, సతీష్, ఆదినారాయణ, సూపర్‌వైజర్ ఎస్.రమణ, రీచ్ మీ ప్రాజెక్ట్ ప్రతినిధి గురునాథ్‌రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధి టి.బాబూరావు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పందుల సంచారం



వేములవలసలో సంచరిస్తున్న పందులు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాస ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో పందుల పెంపకాన్ని నిషేధించారు. గ్రామ శివారున నిర్మానుష్య ప్రాంతాల్లో పందులను పెంచుకోవాలి. కానీ చాలా మంది పెంపకందారులు నిబంధనలు ఉల్లంఘించి పందులను నివాస ప్రాంతాల్లోనే పెంచుతున్నారు. వాటిని మేతకోసం కనీస జాగ్రత్తలు తీసుకోకుండా విడిచి పెడుతున్నారు. దీంతో పందులు బహిరంగంగా నివాస ప్రాంతాల్లో తిరిగి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. అందుబాటులో ఉన్న ఆహారాన్ని కలుషితం చేస్తూ మంచి నీటిని, పాత్రలను పాడుచేస్తున్నాయి. ముఖ్యంగా వేములవలస గ్రామం, వేములవలస రోజువారీ మార్కెట్, బంటుబిల్లి వారి కళ్లాలు సమీపంలోని పంతులు గారి తోట కాలనీలో పందుల బెడద ఎక్కువగా ఉంది. మార్కెట్లోకి చొరబడి కూరగాయలు, పువ్వులను ధ్వంసం చేస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.